

ఆస్పత్రులలో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ 45వ డివిజన్ పరిధిలోని పొగతోట ప్రాంతంలోని వివిధ ఆస్పత్రులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రులను కమిషనర్ సందర్శించి భవనానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ కాపీ, ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ లను తనిఖీ చేశారు. అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు బి.పి.ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆసు పత్రులు నిర్వహిస్తున్న భవనాల యజమానులకు బి.పి.ఎస్ పథకంపై అవగాహన కల్పించేలా కమిషనర్ కరపత్రాలను పంచి పథకం యొక్క ఉపయోగాలను వివరించారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, ఉన్నారు.

ఎయిర్ పోర్టుకు అడుగులు..!

దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు అడుగులు వేగంగా పడుతున్నాయి.. ఐదుగురు సిఎంలు ఇదిగో,అదిగో అంటూ కాలం వెళ్లబుచ్చారు..2018 మార్చి 6న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు.. ఇందుకోసం ముఖ్యమంత్రులు వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు అనేక సార్లు జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. అనేక అడ్డంకులతో అడుగులు ముందుకు పడలేదు.పూర్వపు కలెక్టర్ ఒ.ఆనంద్ ప్రత్యేక కృషితో భూసమస్యలు పరిష్కారమయ్యాయి. కలెక్టర్ హిమాన్షు శుక్లా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కావడంతో దగదర్తి విమానాశ్రయానికి త్వరలో ఒక రూపు రానుంది.. గతంలో తమకు పరిహారం ఇవ్వకుండా అధికారులు, అధికారపార్టీ నేతలు పరిహాసం ఆడుతున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.1379 ఎకరాలు భూ సేకరణ కోసం అధికారులు. చర్యలు తీసుకున్నారు. కోర్టు కేసులు పెండింగ్, రైతుల గుర్తింపు, పరిహారం అందజేయడం వంటి విషయాల్లో స్పష్టత లేకపోవడంతో భూ సేకరణ , పరిహారంలో కొంత వివాదం సాగింది. ఇప్పుడు ఒక కొలిక్కి రావడం శు భపరిణామం..

భూసేకరణ ప్రక్రియ పూర్తి - కలెక్టర్ ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుల అభివృద్ధి కోసం ఎప్పటి నుంచో ప్రతిపాదనలు చేసింది. జాతీయ రహదారిపక్కన దగదర్తి మండలం, దామవరం వద్ద విమానాశ్రయ ఏర్పాటు చేయడానికి పదేళ్ల క్రితమే బీజం పడింది. జాతీయ రహదారిగా దగ్గరగా ఉండడం, ఒంగోలు, నెల్లూరుకు మధ్య కావడంతో ఈ ప్రాంతాన్ని కేంద్ర విమానయాన శాఖ అంగీకారం తెలిపింది. అందులో భాగంగా దామవరం, కౌరుగుంట గ్రామాల పరిధిలో భూ సేకరణ చేపట్టారు.అందులో భాగంగా 1379 ఎకరాలు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేశారు. తొలుత 1051 ఎకరాలు భూమి సేకరించి పరిహారం చెల్లించారు. 333 ఎకరాలకు పరిహారం ఇవ్వాల్సి ఉండగా పూర్తి చేసింది. ప్రభుత్వం నాలుగు రకాల భూములు సేకరించింది. పట్టా, డికెటి, సిజెఎఫ్ఎస్, ఎడబ్ల్యు, పోరంబోకు భూములున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం దామవరంలో 336 ఎకరాలు పట్టా భూమి,. 119 ఎకరాలు డికెటి, 54 ఎకరాలు సిజెఎఫ్ఎస్, 133 ఎడబ్ల్యు, 431 ఎకరాలు పొరంబోకులున్నాయి. కేకే గుంటలో 53 ఎకరాలు డికెటి, 246 ఎకరాలు సిజెఎఫ్ఎస్, రెండు ఎకరాలు ఎడబ్ల్యు, ఉన్నాయి. ఇందులో గతంలో అధికారిక లెక్కల ప్రకారం 1051 ఎకరాలు సేకరించారు. ఇందులో దామవరంలో 235 ఎకరాలు పట్టా భూమి, 110 ఎకరాలు డికెటి,. 54 ఎకరాలు సిజెఎఫ్ఎస్, 133 ఎకరాలు ఎడబ్ల్యు, 223 ఎకరాలు పొరంబోకు పొలాలున్నాయి. కేకే గుంటలో డికెటి 43 ఎకరాలు, సిజెఎఫ్ఎస్ 246 ఎకరాలు, ఎడబ్ల్యు రెండుఎకరాలు భూ సేకరణ చేశారు. పెండింగ్‌లో ఉన్న 101 ఎకరాలు పట్టా భూమి, 23 ఎకరాలు డికెటి, 208 ఎకరాలు పొరంబోకు భూములకు బిల్లులు చెల్లించారు. గతంలో333 ఎకరాలు భూ సేకరణ పెండింగ్ ఉండగా దానిని అధికారులు పూర్తి చేశారు. దగదర్తి విమానాశ్రయానికి అవస రమైన భూమి మొత్తం అధికారులు సిద్ధం చేశారు.

కలెక్టర్లు ప్రత్యేక దృష్టి..!

దగదర్తి విమానాశ్రయం భూసేకరణలో ఉన్న ఇబ్బందులను కలెక్టర్ ఒ. ఆనంద్, ప్రస్తుత కలెక్టర్ హిమాన్షు శుక్లా తొలగించారు. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా పేదలు డికెటి, పట్టా, పొరంబోకు భూములు సాగుచేసుకుంటున్నారు. భూసేకరణకు వచ్చే సరికి ఇవి ప్రభుత్వ భూములని వాటికి పరిహారం ఇవ్వడం కుదరదని తొలుత పెండింగ్ పెట్టారు. . దామవరం, కేకే గుంట గ్రామాల్లో డికెటి పట్టాలకు రూ.13 లక్షలు, పట్టా భూములకు రూ.18 లక్షలు ఇచ్చారు. మరికొన్ని కేసులు హైకోర్టు, కలెక్టర్, తహశీల్దారు వద్ద పెండింగ్‌లో నిలిచాయి. సర్వే నెంబర్ 238 నుండి 259 వరకు సుమారు 32 మంది రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇక్కడ కొందరు వ్యక్తులు సాగుదారుల పేరు లేకుండా మరొకరి పేర్లతో పరిహారం తీసుకున్నట్లు విమర్శలొచ్చాయి. అప్పట్లో . రెవెన్యూ అధికారులకు ధరఖాస్తు చేసుకున్న ప్రతిసారి ఏదో కథలు చెప్పి పంపేవారు. గతంలో రెవెన్యూ, విమానాశ్రయ అథారిటీ అధికారులు ఈ ప్రాంతంలో రోడ్లు, ఇతర పనులు చేయడానికి వచ్చినప్పుడు రైతులు వ్యతిరేకించారు. తమకు పరిహారం ఇచ్చిన తరువాతే పనులు చేయాలని నిలదీశారు. వామపక్షాల బస్సు జాతా సమయంలోనూ ఆ ప్రాంత రైతులు నాయకులను తీసుకెళ్లి చూపించారు. సంవత్సరాల తరబడి సాగుచేసుకున్నప్పుడు అభ్యంతరం పెట్టని రెవెన్యూ అధికారులు పరిహారం ఇచ్చే సమయంలో ఇది ప్రభుత్వ భూమి అని, పరిహారం ఇవ్వమని, బలవంతంగా తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉంటామని వామపక్షాల నాయకులు హామీ ఇచ్చారు. గతంలో 2019 ముందు ఆ ప్రాంత రైతులు రెండు సార్లు టిడిపి జిల్లా కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. 2019లో సిఎం ఎన్. చంద్రబాబు దగదర్తి విమానాశ్రయానికి మార్చి 6న శంకుస్థాపన చేశారు. జన్మభూమి కార్యక్ర మంలో పాల్గొనేందుకు జువ్వలదిన్నెకు వచ్చిన ఆయన అక్కడ నుండి విమానాశ్రయానికి భూమి పూజ చేశారు. 2019 సిఎంగా బాధ్యతలు తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ నుంచి విమానాశ్రయం తరలించడానికి ఏర్పాట్లు చేశారు. రామాయపట్నం పోర్టు వస్తున్నందున దగ్గరలో స్థలం చూడాలని అధికారులను ఆదేశించారు. అప్పటి నుంచి ఎయిర్‌పోర్టు పెండింగ్‌లో పడింది. 2024లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక దగదర్తి పోర్టుకు జీవం వచ్చింది. కలెక్టర్ ఒ. ఆనంద్ భూసేకరణకు ఉన్న అడ్డంకులు తొలగించారు.

విమానాశ్రయానికి ఏర్పాట్లు : కలెక్టర్

దగదర్తి వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టర్ ఒ. ఆనంద్ చాలా కృషి చేశారని, దీనిని తాను ముందుకు తీసుకెళుతున్నానని తెలిపారు. ఈ విషయంలో కేబినెట్‌లోనూ చర్చ జరిగిందని, భూసేకరణ విషయంలో కోర్టు కేసులు, ప్రయివేటు కేసులున్నా వాటిని అధిగమించి సేకరణ పూర్తి చేశామని,ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామని కలెక్టర్ తెలిపారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చుతుందని తెలిపారు.

హిమాన్షు శుక్లా, కలెక్టర్

నేరాల నియంత్రణకు

సాంకేతికత వినియోగం కీలకం

వీడియో కాన్ఫరెన్స్‌లో ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ప్రజాశక్తి-నెల్లూరు

పోలీస్ అధికారులు విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరముందని, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, ఆధారాల సేకరణ సమయంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల హాజరయ్యారు. సిసిటిఎన్ఎస్, డిజిటల్ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, మొబైల్ డేటా అనాలిసిస్, సాఫ్ట్‌వేర్ ఆధారిత పోలీసింగ్ టూల్స్, సీసీటీవీ కెమెరాల ఫుటేజీ విశ్లేషణ, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని సమర్థంగా వినియోగించాల్సిన అవసరముందన్నారు. సాంకేతికతపై పూర్తి అవగాహన కలిగి పనిచేస్తే కేసుల దర్యాప్తు వేగవంతమవుతుందని, ఆధారాలు మరింత పటిష్టంగా సేకరించవచ్చన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్‌పి అజిత వేజెండ్ల

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా జిల్లాకు రానున్న విద్యుత్ వెహికల్ (ఈవి) బస్సుల కోసం ఏర్పాటు చేస్తున్న ఛార్జింగ్ స్టేషన్లకు నిరంతరం నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలన్నదే ప్రధాన లక్ష్యమని ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కె.గురవయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించి పలు విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా జిల్లాకు రానున్న ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవి) బస్సుల కోసం ఏర్పాటు చేయనున్న ఛార్జింగ్ స్టేషన్లకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. అంబాపురం 220 కెవి సబ్ స్టేషన్ నుంచి ఎపిఎస్ఆర్‌టిసికి 33 కేవి డెడికేటెడ్ ఫీడర్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఆపరేషన్, నిర్మాణ విభాగాల అధికారులతో కలిసి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నగరంలో పురపాలక శాఖ మంత్రి పొంగురు నారాయణ శంకుస్థాపన చేసిన ప్రతిష్టాత్మక కంటైనర్ సబ్ స్టేషన్ పనులను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ బాల చంద్ర, శ్రీధర్, పరందామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ట్రాన్స్ కో అధికారులు ఎపిఎస్ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కె గురవయ్య

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని కోడూరు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. చైతన్య జ్యోతి చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఎస్తేరమ్మ మాట్లాడారు. చిన్నవయ సులో వివాహం చేసుకోవడం ద్వారా శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కుటుం బాలు కూడా చిన్నాభిన్నం అవుతాయని ఎస్తేరమ్మ పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే 1098 నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్తేరమ్మ సూచించారు. చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఐ. శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జీ. శంకరయ్య, శ్రీనివాసులు, పద్మావతి, కనకాద్రి, మున్వార సుల్తానా ఉన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని సౌత్ ఆములూరు గ్రామ సచివాలయంలో శనివారం తహశీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో భాగంగా రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొని తహశీల్దార్‌తో కలిసి రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు. తహశీల్దార్ సుధీర్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా మొత్తం 22 గ్రామాలు ఉండగా, రీ సర్వే పూర్తైన 16 గ్రామాల్లో నూతనంగా 1,471 మంది పట్టాదారులకు పాస్‌పుస్తకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సౌత్ ఆములూరు గ్రామంలో మొత్తం 417 మంది పట్టాదారులకు పాస్‌పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. సౌత్ ఆములూరు నీటి సంఘం అధ్యక్షులు గుడ్లూరు గోపాల్ నాయుడు, గుడ్లూరు వెంకయ్య నాయుడు, ముచ్చావ కోటయ్య నాయుడు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బహుమతులు అందజేత

తోటపల్లిగూడూరు :విద్య పిల్లలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే మార్గమని, చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పారిశ్రామిక వేత్త, విద్యాదాత నాయుడు ఆధికేశవుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎన్ డి ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ ధికేశవుల రెడ్డి తండ్రి నాయుడు దశరథరామిరెడ్డి 27వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన ఎన్ డి ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహు మతులను అందజేశారు. కార్యక్రమాన్ని నాయుడు నాగేశ్వరమ్మ వేదిక ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టగా, నాయుడు ఆదికేశవులురెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, పెద్దలు స్థాపించిన ఈ పాఠశాల తమ గ్రామంలో విద్యాభివ ద్ధికి కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. విద్యతో పాటు సేవా భావనను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నాయుడు ఆదికేశవులురెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. తమ దత్తత గ్రామంలో త్వరలో ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధ్యాయులు ఇంగిలేల బాలకృష్ణ పాల్గొన్నారు.

విశాఖకు తరలిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మహా సభల్లో పాల్గొనేందుకు సి ఐటియు మండల కార్యదర్శి మారు బోయిన రాజా ఆధ్వర్యంలో మండల సిఐటియు నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి బయలుదేరారు.

బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

సావిత్రీబాయి ఫూలేకు నివాళి

సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కమిషనర్ నందన్ తదితరులు

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ :సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ వై.ఒ నందన్, డిప్యూటీ మేయర్ తహసిన్ ఇంతియాజ్, కార్పొరేటర్లు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహిళా విద్యకు అంకురార్పణ చేసి, మహిళల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శనీయమని తెలిపారు.

ప్రజాశక్తి-నెల్లూరు :సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ క్రాంతి నగర్, దర్గా మిట్టలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం విద్యాశాఖ అధికారి హరిబాబు, నెల్లూరు అర్బన్ ఎంఇఒ బి తిరుపాల్, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాజా రహంతుల్లా , కోల కిరణ్ కుమార్ మాట్లాడారు. సర్వ శిక్ష అభియాన్ సీ.ఎం.ఓ జి.రమణయ్య, అర్బన్ రూరల్ మండల విద్యాశాఖ అధికారి -2 సయ్యద్ అబ్దుల్ హమీద్, రాచపూడి మురళీధర్ ,జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమెన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం దేవిక , మహిళా ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులు సరస్వతి పద్మజ, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి యం మలి సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు

బిటిఎ ఆధ్వర్యంలో..జ్యోతి సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం బిటిఎ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉషా కళ్యాణి, వసంత కుమారి, సంధ్య రాణి లను ఉత్తమ మహిళా ఉపాధ్యాయినులు గా ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడారు.

డిసిసి అధ్యక్షుడిగా 'నారపరెడ్డి'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది.శనివారం ఎఐసిసి జనరల్ సెక్రటరీ వేణుగోపాల్‌రావు ఈమేరకు ప్రకటించారు. 2024ఎన్నికల్లో కోవూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన వారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తూ ఉండడంతో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ప్రోత్సాహ ంతో ఆయనకు ఈ పదవి దక్కింది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియ మించినందుకు కిరణ్ కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు .నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. పలువురు కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి

క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను కోవూరు నియోజకవర్గ శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆవిష్కరించారు. శనివారం నగరంలోని మాగుంట లే అవుట్ ప్రాంతంలోని ఎంఎల్ఎ నివాసంలో ఆవిష్కరించారు. ఏపీ హంస కోవూరు తాలూకా ప్రెసిడెంట్ సోలా ఉమా,తాలూకా సెక్రెటరీ షేక్ ఆసియా బేగం మాట్లాడుతూ ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఉద్యోగుల సమస్యలపై స్పందిస్తూ, ఉద్యోగుల అభ్యున్నతికి సహకరిస్తున్నారు అని కొని యాడారు. ఎపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు,జిల్లా పబ్లిసిటి సెక్రటరీ మజాహర్,కోవూరు తాలూకా అసోసియేట్ ప్రసిడెంట్ టి. రాఘవేంద్ర , పబ్లిసిటీ సెక్రటరీ ఎస్కే. షబీనా, ట్రెజరర్ ఈ.రమణమ్మ వైస్ ప్రసిడెంట్ ఎస్.రాజేంద్ర ప్రసాద్, జి.కామాక్షి ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.వేణు, మహిళా సెక్రటరీ సిహెచ్.హైమవతి, నగర ప్రసిడెంట్ సయ్యద్ .గౌస్ భాషా, సిటీ సెక్రటరీ బి. మంజరి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

నర్సింగ్ అసోసియేషన్..

ఎపి ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ -2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో నిర్వహించారు. శనివారం వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు రాజేశ్వరి తన ఛాంబర్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సల నిమిత్తం వచ్చిన వారికి వైద్యసేవలందించి ప్రభుత్వానికి, ప్రభుత్వ వైద్యశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వరలక్ష్మి , జిల్లా అధ్యక్షురాలు సత్యవతి తదితరులు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో , జిజిహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిజిహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారిణి డాక్టరు కళారాణి, వైద్యశాల అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు వారి వారి ఛాంబర్లలో నర్సింగ్ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వసుంధర, కోశాధికారి అరుణకుమారి, నాయకులు సుమతి, నిర్మల జ్యోతి, విజయమ్మ, అక్షి, రాధ, అజిర జోహన్న పాల్గొన్నారు.

'కాకాణి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం ఆయన నివాసంలో వైసిపి రాష్ట్ర నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ తదితరులు గోవర్ధన్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తోటపల్లిగూడూరు మండల వైసీపీ నా యకులు, కార్యకర్తలు, అభిమా నులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి -సైదాపురం

మండలంలోనివేములచేడు, అనంతమడుగు సచివాల యాలను సైదాపురం మండల ఎంపిడిఒ రామ్మోహన్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. అటెండెన్స్, వివిధ సర్వేలపై సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు సంక్షేమం

విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా బహూకరించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి పి.వెంకటలక్ష్మమ్మ ప్రకటన చేశారు.. నూతన సంవతస్ర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ సాధికారత అధికారి ఎం.శ్రీదేవి , వసతి గృహ అధికారి చైతన్య పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని విఆర్ కళాశాలలో డిగ్రీ విద్య నభ్యసించిన 1978-81 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం 'మధుర స్మృతులు-2026' పేరుతో ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం నాయుడుపేట ప్రాంతంలోని కిన్నెర హోటల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ సభ్యులు మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సింహపురి నర్సింగ్ హోం వైద్యులు డాక్టరు దయాకర్‌రావు కోరారు.

ఎంఇఒకు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ఎంఇఒకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఇందుకూరుపేట మండల విద్యాశాఖ అధికారి సునీల్‌ను ఎపిటిఎఫ్ 1938 నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ 1938 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ 1938 నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. నూతన సంవత్సరంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ 1938 ఇందుకూరుపేట మండల నాయకులు రామ్మోహన్ రెడ్డి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-సంగం

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎపిఎం రవిశంకర్ రెడ్డి పొదుపు మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులు రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని పొదుపు మహిళలకు కోళ్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా మహిళలు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, తద్వారా వారి కుటుంబ పోషణకు ఊతం లభిస్తుందన్నారు. అంతేకాకుండా కోళ్ల ద్వారా వచ్చే గుడ్లు తినడం వల్ల మంచి పోషకాహారం లభిస్తుందన్నారు. మండలంలో 100 మంది పొదుపు మహిళలకు 100 యూనిట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సిసిలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఆదర్శప్రాయులు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-మర్రిపాడు

పుట్టుకతోనే చూపులేక అంధుడైనా.. అసాధారణమైన సంకల్పబలం, అచంచలమైన కార్యదీక్షతో విద్యా రంగంలో తనదైన ముద్ర వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన జీవితంలో ఎదురైన ప్రతీ అడ్డంకిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. తిరుపతిలోని అంధుల పాఠశాలలో తన విద్యా ప్రయాణాన్ని ప్రారంభించి డిగ్రీ, బీఈడీ, పీజీలను పూర్తిచేసి, విద్యారంగంలోకి అడుగుపెట్టి మోడల్ స్కూల్‌లో అధ్యాపకుడిగా సేవలందించి, ప్రస్తుతం మండలంలోని నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా చక్కగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తన వైకల్యాన్ని ఎప్పుడూ అడ్డంకిగా భావించకుండా, ఉపాధ్యాయులతో కలిసిమెలిసి పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆధునిక బోధనా విధానాలు, క్రమశిక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో మోడల్ స్కూల్‌ను ఒక ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు ప్రేరణగా, ఉపాధ్యాయులకు మార్గదర్శిగా నిలుస్తున్న లక్ష్మీనారాయణ నేడు సమాజమంతా గర్వపడే వ్యక్తిగా నిలిచారు. అంధత్వం ఒక అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని నిరూపిస్తున్న వారి జీవన ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది వారిని అభినందిస్తూ నూతన సంవత్సర సందర్భంగా ఘనంగా సత్కరించి, వారి జీవితాన్ని ప్రతిబింబించే విధంగా రూపొందించిన సన్మాన పత్రాన్ని బహూకరించారు.

దివాకర్‌ను సన్మానిస్తున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

డాక్టర్ దివాకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం జాయ్ లూస్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పి.ఎ.బి.సి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏడు రాష్ట్రాల సంఘాల నాయకులు రెవ డాక్టర్ జి.డి.డి దివాకర్ జన్మదిన వేడుకలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంఎల్ఎకు రెవ డాక్టర్ జి.డి.డి. దివాకర్ తోపాటు సంఘ నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఎను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవ డాక్టర్ జి.డి.డి దివాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి స్వయంగా పాల్గొని దివాకర్‌ను అభినందిస్తూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ దివాకర్ అన్న అంటే తనకు ఎంతో ఇష్టమని తన రాజకీయ జీవితంలో గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన మేలును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని సొంత ఊరు కోసం ఏదోకటి చేయాలనే తపన కలిగిన వ్యక్తి దివాకర్ లాంటి వ్యక్తి జీవితంలో ఇలాంటి సంతోష కరమైన సందర్భంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రెవ డాక్టర్ జి.డి.డి. దివాకర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు హాజరైన ఎంఎల్ఎ కృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే ఎమ్మెల్యే నాయకత్వంలో కావలి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, పాస్టర్లు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని రెవ డాక్టర్ జి.డి.డి దివాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సిఐటియు మహాసభలకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు శనివారం ఆత్మకూరు నుంచి సిపిఎం, సిఐటియు నాయకులు తరలివెళ్లారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆత్మకూరు సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య పిలుపునిచ్చారు.

రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని హసనాపురం గ్రామంలో రైతుల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించేందుకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు మీ భూమి మీ హక్కు పథకం ద్వారా కూటమి ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టిందని దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనుముసముద్రంపేట మండలంలోని హసనాపురం గ్రామంలో పండుగ వాతావరణంలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని, అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, గత ప్రభుత్వం జగన్ ఫోటోలతో పట్టాదారు పాస్ పుస్తకాలను ఇచ్చి రైతులను దగా చేసిందని, ఆ పాస్ పుస్తకాలు దొంగ నోటుతో సమానమని తెలియజేశారు. ఇప్పుడు తాము నూతనంగా అందజేసే పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో నూతన పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టామని రైతుల ప్రయోజనాలు, ఆస్తులకు భద్రత కల్పించేందుకు మీ భూమి మీ హక్కు పథకము ద్వారా 2026 డిసెంబర్ చివరినాటికి రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించిందని తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గత ప్రభుత్వం గత ముఖ్యమంత్రి ఫొటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాలను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. అధికారం చేపట్టిన తొలి కేబినెట్ సమావేశంలోనే రైతులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కోటిమంది రైతుల భూములకు వారి హక్కులు లేకుండా, చేసే విధంగా పనికిరాని పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించేందుకు ప్రయత్నించిందని, ఎన్నికలకు 3 నెలల ముందే ఈ దుర్మార్గపు ఆలోచనతో 35 లక్షల రైతుల పాస్ పుస్తకాలను మార్చేశారని విమర్శించారు. దొంగనోట్లు లాంటి పాత వాసు పుస్తకాలు స్థానంలో, నూతన పాస్ పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్ర మొత్తం మీద 7200 గ్రామాల్లో గత ప్రభుత్వం 23 లక్షల పట్టాలు పంపిణీ చేసిందని, మరో 12లక్షల పట్టాలను తెలిపారు. నెల్లూరు జిల్లాలోని 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత ప్రభుత్వం జగన్ ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేసిందని, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 13 గ్రామాల్లో 5,486 పట్టాలను అందించారని తెలిపారు. వాటి స్థానంలో నేడు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నూతన పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతినెలా 1 నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రతినెలా 9వ తేదీన ఏదోక గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరై పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఎలాంటి చిన్న తప్పు ఉన్నా వెంటనే సరిదిద్దుతామని హామీనిచ్చారు. "రైతుకు అన్నం పెట్టే భూమికి రైతును రాజుగా చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. రీ-సర్వే పేరుతో గత ప్రభుత్వం భూముల సర్వేలో కూడా హద్దురాళ్లపై జగన్ ఫొటోలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేస్తూ సుపరిపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతులకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. అనంతరం రైతుల ఇంటింటికి వెళ్లి నూతన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో పావని, తహశీల్దార్ అనిల్‌కుమార్, స్థానిక నాయకులు రమేష్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, గిరినాయుడు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి పాస్‌పుస్తకాలు అందజేస్తున్న మంత్రి ఆనం

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం 10వ వార్డులో మాలపాలెంలో కళుగోళమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు, గ్రామోత్సవానికి సంబంధించిన గోడపత్రికను శనివారం టిడిపి కార్యాలయంలో కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మేడికొండ సుకుమార్, సీనియర్ నాయకులు ఎల్లంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సంక్రాంతి సంబరాలు, గ్రామోత్సవాన్ని గ్రామ ప్రజలంతా ఐక్యంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. సంప్రదాయాలను కాపాడే ఇలాంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో 10వ, 11వ వార్డులకు చెందిన పలువురు, సుదర్శన, రమేష్, పి.సి. రామారావు, బొడ్డు వెంకటనారాయణ, మొలతాటి విజయ్‌కుమార్, గుండాల దుర్గా ప్రసాద్ పాల్గొనగా, కమిటీ సభ్యులు ఆత్మకూరి శ్రీనివాసులు, ఆత్మకూరి శివకృష్ణ, ఆత్మకూరి సుమన్, బిల్లా దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదార్ పుస్తకాలు అందజేస్తున్న చెంచుకిషోర్‌బాబు

రైతుల భూములకు రక్షణ

- కూటమి ప్రభుత్వాన్ని ప్రశంసించిన చెంచుకిషోర్ బాబు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతుల భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్కులు, సర్వే రికార్డులపై మాజీ ముఖ్యమంత్రి ఫోటోలు ముద్రించడం రైతాంగ ఆత్మగౌరవంపై దాడేనని నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చెంచు కిషోర్ బాబు తీవ్రంగా విమర్శించారు. ఇందుకూరుపేట బిట్-1 పంచాయతీలో నిర్వహించిన రాజముద్ర పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "తాతలు - తండ్రులు తమ రక్తం చెమటోడ్చి సంపాదించుకున్న భూములపై ఒక వ్యక్తి బొమ్మ పెట్టడం రైతుల స్వాభిమానాన్ని అవమానించడమే" అని కిషోర్ బాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ, జగన్ ఫోటోను తొలగించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు అందజేస్తోందని స్పష్టం చేశారు. ఇది రైతుల హక్కులకు తిరిగి ఇచ్చిన గౌరవమన్నారు. రైతులు, పేదలు, కూలీల పక్షాన నిలబడే ప్రభుత్వమే కూటమి ప్రభుత్వమని పేర్కొన్న కిషోర్ బాబు, పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి బిడ్డకు రూ.13వేల ఆర్థికసాయం, మత్స్యకార భరోసా, ఆటో కార్మికులకు వార్షిక ఆర్థిక సాయం వంటి ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజలకు భరోసా ఇస్తోందని తెలిపారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ముందంజలో ఉందని, రైతాంగానికి అండగా నిలిచే నాయకత్వం కోవూరులో ఉందని కిషోర్‌బాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండతో రైతుల హక్కులు కాపాడబడతాయని, రైతుల ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలుస్తుందని ఆయన తేల్చిచెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సావిత్రీబాయి పూలే జయంతి

నెల్లూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంఘ సంస్కర్త అని తన భర్తతో కలిసి చదువు నేర్చుకుని కడవరకు తన జీవితంలో ఎన్నో అవమానాలను భరించి అనేక పాఠశాలలు స్థాపించి వారి చదువు కోసం మహిళల హక్కుల కోసం, దళితులకు సామాజిక న్యాయం కోసం కృషి చేశారని తెలిపారు. .భవిష్యత్ తరాలు తెలుసుకునేందుకు కోసం ప్రతి పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని పెట్టాలని కోరారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకొని పోవడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో రాము, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిపిహెచ్‌ఎస్ స్కూల్ బాలుర, బాలికల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలను సన్మానించారు. విశ్వనాథరావుపేటలోని ఎస్‌ఆర్‌కె ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు హరిబాబు, ఎ బి కండ్రిక ఎం కె ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మనోహర్ నాయుడు, సోమేశ్వరపురం చంద్ర హైస్కూల్ పరసల ప్రధానోపాధ్యాయులు అరుణ ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పి డి నరసింహామూర్తి, ఉపాధ్యాయులు నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మహనీయుల సేవలు మరువరానివని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వి.మాధవరావు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మాధవరావు మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను మరువలేనివన్నారు. సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయినిగా సమాజంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్నారని, స్త్రీ జాతికి ఆదర్శంగా నిలిచిందని సావిత్రిబాయి పూలే త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు పండితులు మధుసూదన శాస్త్రి, డాక్టర్ ఎం.ప్రసాద్ మహిళా ఉపాధ్యాయినులు లీలావతి, నాగరాజమ్మ, సబీనా, సీతామహాలక్ష్మి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందంతో ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన వర్గాల కోసం ఆమె చేసిన కృషిని పాఠశాల బృందం వివరించారు. అందుకే ఆమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఏ.సుభాషిణి తెలియజేశారు. పై కార్యక్రమాన్ని పురస్కరించు కొని పాఠశాల మహిళా ఉపాధ్యాయులు సుభాషిణి, మామూలబీ లను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, నరేష్, మస్తానయ్య, వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ రామిరెడ్డి పాల్గొన్నారు.


మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందరరేగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను చుంచులూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు సునీత, రహిమలను శాలువాలు, పూలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ మాట్లాడుతూ మనదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, వారు మహిళా విద్య కోసం ఎంతగానో కృషి చేశారని, వారి జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగంలో..

ప్రజాశక్తి-సంగం : సంగంలోని జిబికెఆర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయిని సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలోనే ఉపాధ్యాయులందరూ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలర్పించి శ్ర ద్రాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను ఆమె అందించిన విద్యను మహిళా ఉన్నతి కోసం పాటు పాడిన ఆమె కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మరో కీలక అడుగు పడింది. కావలి ముసునూరు 14వ వార్డులో కావలి మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన పైపులైన్ పనులను శనివారం ప్రారం భించారు.కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులను వార్డు నాయకులతో కలిసి, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ టెంకాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలతో కావలి పట్టణంలో ప్రతిఒక్క ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దశలవారీగా పట్టణమంతటా ఇలాంటి అభివృద్ధి పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి చొరవతో కావలి పట్టణంలో మౌలికవసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డి.ఇ. సాయిరాం, మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు లింగం మాల్యాద్రి, బిట్రగుంట వెంకట్రావు, భోగ్యం కిషోర్, బత్తిన ప్రభాకర్, కల్లగుంట రవి నాయుడు, మర్లపాటి సీతారామయ్య, మాధవ, జీర్ర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

మొక్కల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-ఉదయగిరి

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని వీధుల్లోని చెత్త కుప్పలను, రోడ్డుకిరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులను ఎంపిడిఒ శ్రీనివాసులు ఆదేశాలతో డిప్యూటీ మండల అధికారి ఎస్.మోహన్‌రావు, కార్యదర్శి కరిముల్లా శరవేగంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మండలంలో 14, 15, 16న స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఈ కార్యక్రమంతో గ్రామంలోని ప్రతి వీధిలో ఉన్న వాటిని తొలగింపు చర్యలు సిబ్బంది చేపడుతున్నట్లు వారు తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమ ప్రాణాంతకం..

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా రైతాంగానికి ఎరువుల కొరత నుంచి విముక్తి కలిగించేందుకు 1997లో అప్పటి ఇఫ్కో చైర్మన్‌గా వ్యవహరిస్తున్న పెళ్లకూరు రామచంద్రారెడ్డి హయాంలో ఎరువుల కర్మాగారాలను నిర్మించేందుకు ఇఫ్కో సెజ్ పేరుతో సుమారుగా 2,300 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే ఆ భూముల్లో ప్రజారోగ్యానికి భంగం కలిగే విధంగా, కాలుష్యాన్ని విడుదల చేసి పర్యావరణాన్ని దెబ్బతీసే ఇథనాల్ పరిశ్రమలు ఏకంగా మూడింటిని స్థాపించేందుకు ప్రభుత్వం అనుకూలంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రజల నుంచి అభిప్రాయం సేకరించేందుకు ఒకే రోజు గంటల వ్యవధిలో మూడు పరిశ్రమల స్థాపనకు రంగం సిద్ధం చేసింది. ఇతర రాష్ట్రా ప్రభుత్వాలు ఆయా ప్రాంతాల ప్రజలు వ్యతిరేకరించడంతో ఇథనాల్ పరిశ్రమ తమ రాష్ట్రంలో స్థాపించేందుకు అనుమతులు ఇవ్వలేదు. అటువంటి పరిశ్రమను నెల్లూరు జిల్లాలో స్థాపించేందుకు కుటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు, పర్యావరణ ప్రేమికులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఇథనాల్ పరిశ్రమ స్థాపన వల్ల కలిగే అనర్థాలను, కాలుష్యం వల్ల ఏర్పడే ప్రమాదాలను ప్రజలకు వివరించడంతో వారు సైతం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకించారు. అయితే ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం మొండిగా.. నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు వామపక్ష పార్టీల నాయకులను హౌస్ అరెస్టు చేయడం, గృహనిర్బంధం చేయడం, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్తున్న వారిని మార్గం మధ్యలో పోలీసులు అరెస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఈ చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విశాఖ పట్టణంలో డిసెంబరు 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి సిఐటియు శ్రేణులు, కార్మికులు, కర్షకులు భారీ స్థాయిలో తరలి వెళ్లారు. ఈ మహాసభల ప్రాముఖ్యతను వివరించే విధంగా జిల్లాలో శ్రామికోత్సవ కార్యమ్రం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎన్నికల ప్రచార సభల్లో గూడూరు ప్రజలకు టిడిపి నాయకులు చేసిన హామీల మేరకు గూడూరులోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలో కలిపేందుకు అనుకూలంగా నోటిఫికేష్ (గెజిట్) విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రాపూరు, కలువాయి, సైదాపురం ప్రాంతాలను తిరుపతి జిల్లాలో కలిపేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందో అందుకు వ్యతిరేకంగా ప్రజలు తమ అభిప్రాయాన్ని జిల్లా అధికారులకు నిరసన రూపంలో తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడం.. గూడూరు శాసనసభ్యులు ఏకంగా తాను రాజకీయాల నుంచి విరమించుకుంటున్నానంటూ ప్రకటనలు చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి తన నిర్ణయాన్ని మార్పు చేసుకుంది. నూతన సంవత్సరం సందర్భంగా యువత, ప్రజలు నిర్వహించుకొనే సంబరాలల్లో ఎటువంటి ఘటనలకు చోటు లేకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసు యాంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

IN THE COURT OF HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE:: GUDUR
EP. No. 131/2013
OS.694 / 2009
Duvvuru Bharagavamma ....D.Hr
Vs.
Nadavala Chengaiah .... J.Dr
వేలం ప్రకటన
పై నెంబరున డిక్రీ హోల్డర్, డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జే.డి.ఆర్.తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను **తే. 2-2-2026 దిన** ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5-00 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
SCHEDULE
Tirupati District Registration - Gudur Sub-registration - Gudur Mandal - Vinduru Village - Khatha No.1015 - Survey, No.587-3B wet land an extent of Ac.0.15 cents out of Ac.2.34 cents bounded by **East :** Land belongs to Neelam Vaidevamma (land in Sy.No.588/2) **South:** Land belongs to Nadavala Chengaiah (remaining the land in Sy.No.587-3B) **West :** Land belongs to Nadavala Chengaiah (remaining the land in Sy.No.587-3B) **North:** land belongs to Nadavala Chengaiah (remaining the land in Sy.No.587- 3B).
Within these boundaries an extent of Ac. 0.15 cents out of Ac. 2.34 cents of wet land with all irrigation and easement rights.
D.Hr value for Ac.2.34 cents is Rs. 1,00,000.00.
Amin value for Ac.2.34 cents is Rs. 9,00,000.00
Market value for Ac.0.15 cents is 60,000.00.
బి. బాలప్రదీప్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.ఎం.
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, గూడూరు.

CHANGE OF NAME
I, **BAPATU HARI KRISHANA** *(Old Name) Son of BAPATU SANKAR REDDY, Residing at KOLLAPANAYUNIPALLI Village, Chejarla Mandal, SPSR Nellore District, A.P.hereby declare that I have changed my Name as*
BAPATU HARI KRISHNA
(New Name)
Henceforth, I will be known as
BAPATU HARI KRISHNA